క్లుప్తంగా

చెట్ల నరికివేత



నరికిన చెట్లు

నూతనకల్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తుమ్మచెట్లను నరికి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని బక్కహేమ్లాతండా ఆవాసం బోటి కింది తండా శివారులోని మర్రికుంటలో సోమవారం ఆ తండాకు చెందిన ఓ వ్యాపారికి కొంత మంది రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టానుసారంగా చెట్లను నరికి వేయించాడు. అయినా అధికారులు పట్టించుకోలేదు. అక్రమంగా చెట్లు నరికిన కలప వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్‌ను వివరణ కోరగా తనకు చెట్ల నరికివేత విషయమై ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. వెంటనే రెవెన్యూ సిబ్బందిని పంపించి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాధితులకు పరామర్శ

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన సాయిని లక్ష్మణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సోమవారం జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ పరామర్శించారు. అలాగే స్థానిక శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయచైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్ తల్లి, రైతుబంధు సమితి సభ్యురాలు సీహెచ్.మేఘమాల వెన్నెముక ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతుండగా ఆమెను కూడా పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాపా వెంకటేశ్వర్‌రావు, బైరబోయిన రామలింగయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్, కడారి నరేష్, దావుల లింగయ్య, వట్టె వెంకన్న తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మద్దిరాల : మండల పరిధిలోని చందుపట్ల గ్రామానికి చెందిన దువ్వ సాయిలు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. దీంతో తెలంగాణ ఉద్యమకారుడు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ సోమవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు దువ్వ యాదగిరి, మండల బాధ్యులు తన్నీరు మహేష్, తునికి బద్రి, బోనగిరి అనిల్, సందీప్, నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మేరు సంఘం కమిటీ ఎన్నిక



నియామకపత్రం ఇస్తున్న ప్రతినిధులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఏనుబాములలో సోమవారం మేరు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కందగట్లకు చెందిన గుంటి సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రధాన కార్యదర్శిగా నందగిరి దేవేందర్, కోశాధికారిగా గుంటి అంజయ్యలతో పాటు మరికొందరు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గుంటి సత్యనారాయణ, అబ్జర్వర్‌గా రేణిగుంట నరేందర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కీర్తి వెంకటేశ్వర్లు, కీర్తి మధుసూదన్, వెంకన్న, లక్ష్మీనర్సయ్య, ఆదిలక్ష్మి, సైదులు, పూలమ్మ పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్లలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆవిష్కరించిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన తొట్ల బాలమల్లు ఇంటి గోడకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తుండగా చప్పుడు విని ఇంటి యజమాని లేచి చూసే సరికి దుండగులు పారిపోయారని పలువురు గ్రామస్తులు తెలిపారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ముందస్తు అరెస్ట్



అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చివ్వెంల : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వట్టిఖమ్మంపహాడ్ శివారులోని 420 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న సభకు మంత్రి జగదీశ్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో గ్రామ అభివృద్ధి పనులు, అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలపై సభను అడ్డుకుంటామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. దీంతో ముందస్తుగా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు సోమవారం తెల్లవారు జామున అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి వదిలి వేశారు. అరెస్టయిన వారిలో నాయకులు ఎల్కపల్లి వెంకన్న, గోగుల ఈదయ్య, కొండ వెంకన్న, ఎల్కపల్లి సైదులు, వీరబోయిన మహేష్ తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు పక్కా భవనాలు

- పెన్‌పహాడ్ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి నిధులు
- ఇప్పటికే 4 గ్రామాల్లో పనులు ప్రారంభం
- మిగతా జీపీల్లోనూ వెంటనే పనులు చేపట్టేలా అధికారుల ప్రణాళిక



తంగెళ్లగూడెంలో కొనసాగుతున్న నూతన గ్రామ పంచాయతీ భవనం పనులు

పెన్‌పహాడ్ : ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం చిన్న గ్రామాలను, తండాలను పంచాయతీలుగా గుర్తించింది. కానీ కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించకపోవడంతో గ్రామసభలు, పాలక వర్గ సమావేశాలు, పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది. ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం శాశ్వత భవనాలు నిర్మించాలని తలపించింది.

పెన్‌పహాడ్ మండలంలో ఇలా..

రూ. కోటి 80లక్షలతో మండలంలోని 9 పంచాయతీలకు భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ. 20లక్షలు కేటాయించింది. ఇప్పటికే నాలుగు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే మరో 5 పంచాయతీల్లో పనులు ప్రారంభించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆరు కొత్త పంచాయతీలకు..

మూడు పాత పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటితోపాటు మండలంలోని 6 కొత్త పంచాయతీలకు భవనాలు నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మండలంలోని గాజులమల్కాపురం, చినగారకుంట తండా, న్యూబంజారాహిల్స్ తండాల్లో పనులు ఫౌండేషన్ లెవల్లో ఉండగా తంగెళ్లగూడెం పంచాయతీ భవనానికి పిల్లర్ వరకు నిర్మాణం జరిగింది. మిగతా గ్రామ పంచాయతీలకు భవనాల నిర్మాణ పనులను త్వరలోనే చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపడుతునున్నారు. అధునాతన సౌకర్యాలతో ఆరు నెలల్లోగా పంచాయతీల్లో పక్కా భవనాలు నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది

“ మండలంలోని తంగెళ్లగూడెం నూతన పంచాయతీగా ఏర్పాటైంది. కానీ భవనం లేకపోవడంతో తాత్కాలికంగా ఓ ప్రైవేట్ భవనంలోని గదిలో గ్రామ పంచాయతీ పనులు నిర్వహిస్తున్నాం. ఇబ్బందుల నడుమ సమావేశాలు, ఇతర కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం. ప్రభుత్వం పంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ఇప్పటికే పిల్లర్ లెవల్‌లో నిర్మాణ పనులు చేపట్టాం.

– బాదె ఈశ్వరమ్మ, సర్పంచ్, తంగెళ్లగూడెం

వేగవంతంగా నిర్మాణాలు

“ పెన్‌పహాడ్ మండలంలో ప్రస్తుతం నాలుగు గ్రామ పంచాయతీలకు భవనాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మిగతా వాటిని కూడా త్వరలోనే చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.



– గోపి, పంచాయతీ రాజ్ ఏఈ

యోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు



అర్వపల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సోమవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి తమ పూర్వీకులు 900ఎకరాల భూములు దానం చేశారని చెప్పారు. పేద రైతులు ఈ భూములను అనుభవిస్తూ సాగుచేసుకుంటున్నారని, వీరికి ఉచితంగా పట్టాలు ఇవ్వడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తనవంతు కృషి చేశానని అన్నారు. పట్టాలు చేసే క్రమంలోనే ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. దేవాదాయశాఖ అధికారులు వెంటనే దేవాలయ భూముల కౌలుదారుల సమావేశాన్ని జరిపి పేదలైన రైతులకు పట్టాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, కొప్పుల వేణారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, దేవస్థాన మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు, బైరబోయిన మహరాజు, శిగ నసీర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ కె.అవిలయ్య, గుడిపల్లి సోమిరెడ్డి, దాసరి సోమయ్య, వీరారెడ్డి, బింగి కృష్ణమూర్తి, దొంగరి గోవర్ధన్, మల్లయ్య, శ్రీను, యాదయ్య, అమీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి

నూతనకల్ : రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు విత్తనాలను సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన తెలిపారు. జీలుగ, విత్తనాలను అందించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో విత్తనాలు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జటంగి గణేష్, మేడిపల్లి అశోక్, ముత్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ



నాగారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్

నాగారం : దేశంలో కరెంటు కోతలు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని 132/32 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విద్యుత్ విజయోత్సవ సభలో పాల్గొని, జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రాన్ని విద్యుత్ వెలుగులతో నింపిన ఘనుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు నిత్యం కరెంటు కోతలు ఉండేవని, నేడు సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో నిరంతరం వెలుగులు విరజిల్లుతున్నాయని అన్నారు. రైతులకు నిరంతరం 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని కొనియడారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చట్టాలు తెచ్చేందుకు ప్రయత్నిస్తూ, రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలని కుట్రలు చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా ఎదిగారని అన్నారు. సమావేశానికి ముందుగా జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు విద్యుత్ పరిస్థితి, రాష్ట్రం ఏర్పాటు తరువాత సాధించిన ప్రగతిని వివరించే ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గుంటకండ్ల రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీనివాస్, రాజశేఖర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.ఏ.రజాక్, ఎంపీపీ కూరం మణివెంకన్న, సర్పంచ్ చిప్పలపల్లి స్వప్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్, వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, విద్యుత్‌శాఖ ఏడీలు శ్రీనివాస్, అరుణ్‌కాంత్, ఏఈఈ మహేంద్రకుమార్, తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీఓ శోభారాణి, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్, నాయకులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్య, ఆయా గ్రామాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



సూర్యాపేట రూరల్ : బొడ్రాయి ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న మంత్రి



ఆత్మకూర్ (ఎస్) : ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

సూర్యాపేట రూరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని, భక్తిభావం పెంపొందించుకోవాలని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని బుర్కపిట్ట తండాలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, ఎండీ చాంద్‌పాషా, గుర్రం సత్యనారాయణరెడ్డి, షేక్ రఫీ, పంతులు నాయక్, శ్రీధర్, చాంప్లా నాయక్, శివ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు అధిక ప్రాధాన్యం

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం ఆధ్యాత్మికతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్ని మతాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తోందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండల పరిధిలోని ఇస్తాళాపురం గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 40 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాకముందు కరువుతో విలవిలలాడిన సూర్యాపేట ప్రాంతం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం కాళేశ్వరం జలాలతో, పాడిపంటలతో కళకళలాడుతుందని అన్నారు. ఊరూరా బొడ్రాయి పండుగలు, నూతన దేవాలయాల నిర్మాణాలతో గ్రామాలు ఆధ్యాత్మికతను సంతరించుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న కేసీఆర్‌కు కృతజ్ఞతగా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఎస్సారెస్పీ కాల్వల వెంట నిర్వహించే లక్ష జన హారతి కార్యక్రమానికి జనం లక్షలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తూడి లావణ్య, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మలశ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ మర్ల స్వర్ణలత, తూడి నర్సింహారావు, బత్తుల ప్రసాద్, కొణతం సత్యనారాయణరెడ్డి, ఇందిర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుల నియామకమెప్పుడో..

- మండలంలో కొత్తగా ఏర్పడిన 6జీపీలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు కరువు
- క్షేత్ర సహాయకులు లేక కూలీలు, కార్యదర్శుల పాట్లు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

అర్వపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో పేదల వలసలను నివారించి వారికి పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. నిరుపేదలకు గ్రామాల్లోనే తగిన పనులు కల్పించడం ఈ పథకం ఉద్దేశం. పేదలకు పనులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి క్షేత్ర సహాయకుడిని నియమించింది. కాగా కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ఇంతవరకు క్షేత్ర సహాయకులను నియమించకపోవడంతో ఉపాధి పనుల కల్పనలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో ఈ పథకం లక్ష్యం నీరుగారుతోంది. అయితే కొత్త పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేక పనులు సకాలంలో కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీలకు గాను 23,688 మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. అలాగే 9,810 ఉపాధి కార్డులున్నాయి. కాగా మండలంలో కొత్తగా ఏర్పడిన బొల్లంపల్లి, రామన్నగూడెం, ఉయ్యాలవాడ, వేల్పుచెర్ల, నాన్యతండా, సూర్యనాయక్‌తండాలకు క్షేత్ర సహాయకులు లేరు. అయితే ఈ గ్రామాలకు ఇతర గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. దీంతో ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కొత్త పంచాయతీల కార్యదర్శులపై అదనపు భారం పడి వారు పని ఒత్తిడితో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త గ్రామ పంచాయతీలకు ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను నియమించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేక ఇబ్బందులు

“ కొత్త పంచాయతీలకు ఇంతవరకు క్షేత్ర సహాయకులను నియమించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో కూలీలకు పనులు కల్పించడం ఇబ్బందిగా మారుతుంది. ఆన్‌లైన్‌లో కూలీల వివరాల నమోదు, కూలీలకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. కొత్త పంచాయతీలకు వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించాలి.



– మచ్చ నర్సయ్య, ఉపాధి హామీ మేట్ల సంఘం రాష్ట్ర నాయకుడు

ప్రస్తుతం ఉన్న ఎఫ్‌ఏలతోనే పనులు

“ కొత్త పంచాయతీల్లో క్షేత్ర సహాయకుల నియామకం పైస్థాయిలో జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న క్షేత్ర సహాయకులతోనే పనులు కల్పిస్తున్నాం. కూలీలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూస్తున్నాం. కొత్త పంచాయతీలకు పాత పంచాయతీ ఎఫ్‌ఏలను ఇన్‌చార్జ్‌లుగా నియమించడం జరిగింది.



– సీహెచ్ ఉపేందర్, ఉపాధిహామీ పథకం ఏపీఓ

వాట్సప్ గ్రూప్ ద్వారా ఆర్థికసాయం



లక్ష్మణ్‌కు ఆర్థికసాయం అందిస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన సాయిని లక్ష్మణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడు నిరుపేద కుటుంబానికి చెందినవ్యక్తి కావడంతో ఆయన స్నేహితులు, గ్రామస్తులు అర్వపల్లి గ్రామ అభివృద్ధి పేరున ఉన్న వాట్సప్ గ్రూప్‌లో లక్ష్మణ్‌కు వైద్య ఖర్చులకోసం సాయమందించాలని అభ్యర్థించారు. దీంతో వాట్సప్ గ్రూప్‌లోని సభ్యులు తమవంతు సాయంగా తలా కొంత విరాళాలు ప్రకటించారు. అయితే ఈ గ్రూప్ ద్వారా సేకరించిన రూ.69వేల ఆర్థికసాయాన్ని సోమవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో బైరబోయిన రాకేష్, సంతోష్, భూమయ్య, వెంకటేష్, నగేష్, ఎం.కిరణ్, ఎస్.కార్తీక్ పాల్గొన్నారు.



నాగారం : నర్సింహులగూడెంలో ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్థికసాయం అందజేత

నాగారం : నాగారం మండల పరిధిలోని నర్సింహులగూడె గ్రామానికి చెందిన మిట్టపల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పంపించిన రూ.10,000 ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి తరాల ఆంజనేయులు, వెంకన్న, మహాంకాళి, నాగరాజు, బుర్ర వీరయ్య, లింగమల్లు, సాయి, వీరేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రేపు కాళేశ్వరం జలాలకు లక్ష జన హారతి



మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుక

అర్వపల్లి : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాగునీటి దినోత్సవం సందర్భంగా ఎస్సారెస్పీ 71 డీబీఎం కాలువ వెంట నిర్వహించే కాళేశ్వరం జలాలకు–లక్ష జనహారతి కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ కోరారు. లక్ష జన హారతి కార్యక్రమం విజయవంతానికై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం జలాలకు హారతులిచ్చి పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్, ఎంపీడీఓ కతురోజు ఉమేష్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీఓ ఉపేందర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.నర్సింహరాజు, ఏఈఈ హరిస్వరూప్, వివిధశాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



తుంగతుర్తి : కొత్తగూడెంలో బడిబాటలో పాల్గొన్న సర్పంచ్ విజయ్, ఉపాధ్యాయులు



అర్వపల్లి : బడిబాటలో పాల్గొని మాట్లాడుతున్న సర్పంచ్ బాబు, తదితరులు

తుంగతుర్తి : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సర్పంచ్ నకిరేకంటి విజయ్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పర్వీనా, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీబాయి, శారద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి సహకరించాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజలు సహకరించాలని కోడూరు సర్పంచ్ గుయ్యని బాబు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా సోమవారం జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరులో యూపీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, సాయికుమార్, రాము, అంగన్‌వాడీ టీచర్ సంద సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షకులు

ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా పట్టణ పరిధిలోని విశ్వ సస్టెయిన బుల్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం పర్యావరణ పరిరక్షణ పనులు చేపట్టారు. సద్దుల చెరువు సమీపంలో పేరుకపోయిన చెత్త, గుర్రపుడెక్కలను తొలగించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



సినీ నటుడి కారు ఢీకొని ఆవు మృతి

చివ్వెంల : సినీ నటుడి కారు ఢీకొని ఆవు మృతిచెందింది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సినీ నటుడు అశోక్ కుమార్ కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో వల్లభాపురం గ్రామ శివారులో రోడ్డుదాటుతున్న ఉండ్రుగొండ గ్రామానికి చెందిన దేవుని ఆవును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన గ్రామస్తులు కారును అడ్డుకున్నారు. దీంతో మరో ఆవును కొనిస్తానని అశోక్ కుమార్ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

గేదెలను ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్ : ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై సోమవారం కారు గేదెలను ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందారు. వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ నేతాజీ–ఇందిరా దంపతులు సోమవారం సాయంత్రం ఖమ్మం నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు బయలుదేరారు. సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి గ్రామ శివారులోకి రాగానే రహదారిపై వెళ్తున్న గేదెలు కనిపించకపోవడంతో డ్రైవర్ ఒక్కసారిగా కారుతో గేదెలను ఢీకొట్టాడు. గేదె వచ్చి కారు ముందు భాగంపై పడడంతో నేతాజీ(74) అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి రూరల్ ఎస్ఐ సాయిరాం చేరుకొని పరిశీలించారు. నేతాజీ మృతదేహాన్ని స్థానిక జనరల్ ఆస్పత్రిలో మార్చురీలో భద్రపరిచారు. భార్య ఇందిరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



మాట్లాడుతున్న గుడిపాటి సైదులు

తుంగతుర్తి : తుంగతుర్తి రైతు సేవా సహకారం సంఘంలో రైతులకు కావాల్సిన యూరియా, 10-26-26, 20-20-013, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకారం సంఘంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని సొసైటీ ఆధ్వర్యంలో మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా 95 వేల బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మోడెం శ్రీలత, సీఈఓ వెంకటేశ్వర్లు, మేనేజర్ యాదగిరి, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, డైరెక్టర్లు యాదగిరి, రామచంద్రు, మజీద్, భిక్షంరెడ్డి, రామనర్సమ్మ, పూలమ్మ, యాకయ్య, ఈదయ్య, రవీందర్‌రెడ్డి, చాంప్లానాయక్, సిబ్బంది యాదగిరి, మహేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజయోత్సవం

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్వపల్లిలోని విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ సిబ్బంది విద్యుత్ విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్, సబ్ ఇంజనీర్ గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుడిపాటి సైదులు